




# విడిదిల్లు

**చుట్టూ వున్న** వసారాలన్నీ కడుగుతున్నారంటే మా ఇల్లు విడిదికి ఇచ్చినట్టే.

“చిట్టెమ్మా మీ ఇల్లు పెళ్లి కొడుకుకి విడిదిగా ఇస్తన్నాం. నువ్వయితే మర్యాదలకు లోటుచెయ్యవు మగపెళ్లారినుంచి మాట రాకుండా చూసుకుంటావు అని ఆడపెళ్లాళ్లు” అనేవారు.

ఊళ్లో దాబా ఇళ్లు వున్నా, మా ఇల్లే పెళ్లికొడుకు విడిదిల్లుగా ఇచ్చేవారు .

నాకు పెళ్లికూతుర్లంటేనే ఎక్కువ ఇష్టం, పెళ్లి కూతుళ్లు పూలజడలు, రంగురంగు చీరలు, నగలు, బుగ్గన చుక్క పెట్టుకుని తయరవుతార. అందుకే నేను ఎక్కువ పెళ్లికూతుళ్ల చుట్టూ ప్రదక్షణలు చేసేదాన్ని.

మా వూళ్లో ఏ పెళ్లి తంతు జరిగినా పెళ్లి కూతురు అత్తారింటికి వెళ్లే వరకూ నేను వుండాల్సిందే. అర్ధరాత్రి ముహూర్తమైనా సరే పెళ్లి చూసి అంపకాల సీన్ అయ్యాకే నిద్ర పోయేదాన్ని.

ఆ రోజు నాయనమ్మ బుజ్జక్క పెళ్లికి విడిది మా ఇంటిదగ్గరే ఇస్తన్నారని చెప్పింది. బుజ్జక్క పెళ్లి రోజు రానే వచ్చింది.

మగ పెళ్లారు వచ్చే యేళయ్యింది ‘ఆ గుండిగతో నీళ్లు కాళ్లు కడుక్కోటానికి పెట్టండి … అమ్మాయ్ ఆ పరుపులు దక్షిణపేపు వసారాలోనూ కొండజాలోనూ పరిపించు. అదిగో ఆడపెళ్లాళ్లు పంపిన తెల్ల దుప్పట్లు ఏయించమ్మా’ అంటావుండగానే చిన్నకార్లు ఆగాయ.

పెళ్లి కొడుకు, చుట్టాలు వచ్చి కాళ్లు కడుక్కుని పరుపులమీద కూర్చున్నారు.

ఈ లోగా మేళతాళాల్తో ఆడపెళ్లివాళ్లు పానకం బిందెలతో వచ్చారు. అందరికీ పానకాలు ఇచ్చారు.

సందట్లో సడేమియా అన్నట్టు నేనూ పానకం రెండు గ్లాసులు తాగేశాను.

పెళ్లి అర్ధరాత్రి కాబట్టి మిగతావాళ్లు భోజనాలకు వెళ్లారు. పెళ్లి కొడుకు ఇంకో ఇద్దరు మాత్రం బిక్కు బిక్కుమంటా కూర్చున్నారు .

పెళ్లి కొడుక్కి అన్నం పెట్టరంట ఏదో టిఫిన్లు పంపారు. చిట్టెమ్మ పెళ్లి కొడుక్కి అవన్నీ పళ్లాలలో పెట్టి తినే వరకూ వదలలేదు.

పెళ్లికి వాళ్లంతా వెళ్లే వరకూ ఏంకావాలో చూసి వాళ్లకు సదుపాయాలన్నీ చిట్టెమ్మ చూసుకుంది.

పెళ్లి ముహూర్తం ఇంకో గంటలో వుందనంగా మళ్లీ మేళాలు మోగిస్తూ పెళ్లి కొడుకును మండపానికి తీసుకెళ్లారు.

పెళ్లంతా అయ్యాక ఇద్దరినీ మళ్లీ విడిదింటికి తీసుకొచ్చారు. బుజ్జక్కనీ పెళ్లి కొడుకునీ తీసుకొచ్చి వసారాలో వున్న పరుపు మీద ఎదురెదురుగా కూర్చోబెట్టారు .

మధ్యలో పెద్ద ఇత్తడి పళ్లెం పెట్టి పాలు పోశారు. అమ్మాయి అమ్మా నాన్నా ఆ పాలలో పెళ్లి కూతురి రెండు చేతులూ అద్ది ముందు పెళ్లి కొడుకు చేతుల్లో పెట్టారు.

అత్త మావ ఆడపడుచుల చేతుల్లో అమ్మాయి చేతులు పెడుతూ అమ్మా నాన్నా కళ్లు  తుడుచుకుంటున్నారు. చుట్టు పక్కల వాళ్లూ ఏడుపు మొదలెట్టారు. అందరూ ఏడుస్తుంటే పెళ్లికూతురు కూడా ఏడుపు మొదలెట్టింది. అంపకాలు అంటే అమ్మాయిని అత్తారికి అప్పగించినట్టేనంట. నాకు పెళ్లిలో ఈ ఏడుపుల గోల మాత్రం నచ్చలేదు. కానీ పెళ్లి అంతా బాగా అయ్యి, చివర్లో బుజ్జక్క పెళ్లికొడుకుతో కారెక్కి వెళ్లి పోతుంటే  మాత్రం నాకూ ఏడుపొచ్చింది.

'అంతేనమ్మా ఎంత పెంచినా ఆడపిల్లే  ఈడపిల్ల కాదు' అని ఆడంగులంతా కొంగులతో కళ్లు తుడుచుకుని ఇళ్లకు వెళ్లారు.

ఆ ఇంట్లో విడిది చేసిన అల్లుళ్లు ఏ పండగకి అత్తారింటికి వచ్చినా మా ఇంటిక్కూడా ఒక్కసారన్నా వచ్చెళ్లే వాళ్లు .

బుజ్జక్క వాళ్ల ఆయన పండగకి అత్తారింటికి వచ్చి మా ఇంటికి వచ్చాడు. బుజ్జక్క పెళ్లయ్యే వరకూ తన వెనకాలే తిరిగేదాన్ని .

" రా అయ్యా ! ఎప్పుడొచ్చావ్?" అని ప్రేమగా కుర్చీలో కూర్చోబెట్టి తాత చిట్టెమ్మ మర్యాద చేశారు.

"మా పిల్లని బాగా చూసుకుంటన్నావా అబ్బాయ్?" అని నాయనమ్మ ఆరా.

ఏదో  తినడానికి  పెడితే "అబ్బో  పొట్ట ఖాళీ లేదండీ!" అన్నాడు బావ

"నిజమేలే అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుడికి కడుపు ఖాళీ వుండదులే, పోన్లే మమ్ముల్ని చూడటానికి వచ్చావ్ అదేచాలు" అని ఆనందపడింది .

చిట్టెమ్మారిల్లు ఎందరు అల్లుళ్లకు విడిదయ్యిందో గానీ ఆ అల్లుళ్లకు మనవలు మనవరాళ్లూ పుట్టి తాతలైనా తమకు విడిదిచ్చిన ఆ ఇంటిని మాత్రం గుండెల్లో గుర్తు పెట్టుకోకుండా వుంటారా!

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments